క్లుప్తంగా

ఖాతాదారుల కోసమే సేవలు



ప్రచారం చేస్తున్న సిబ్బంది

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఖాతాదారుల కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో బుధవారం బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో నూతన ఖాతాదారులు, డిపాజిట్‌దారులకు రూ.2నుంచి రూ.4లక్షల వరకు ఉచితబీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రాజ్‌కుమార్, మధు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయలపై అవగాహన



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

పుల్‌కల్(అందోల్): పండ్లు, కూరగాయల పెంపకం, వినియోగంపై సర్వోదయ అభ్యుదయ సంఘం ప్రతినిధులు మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీఏఆర్, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం గొంగ్లూర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. న్యూట్రిషన్ ప్రొఫెసర్ సుప్రజ వివిధ రకాల పండ్లు, కూరగాయల ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్లు సుచరిత, స్వప్న, ఐఆర్‌ఎస్ అధికారి సుధాకర్‌నాయక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రమేశ్

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. బుధవారం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన వివిధ చట్టాల గురించి వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గోవింద్ రామ్, ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

షెట్కార్ ఓటేసిన బూత్‌లో ఆధిక్యం

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన సురేష్ షెట్కార్ స్వగ్రామం నారాయణఖేడ్‌లోని ఆయన ఓటేసిన 168వ నెంబరు పోలింగ్ బూత్ పరిధి ఓటర్లు మెజార్టీ ఓట్లేసి ఆధిక్యతను వ్యక్తం చేశారు. షెట్కార్‌కు 368ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 209ఓట్లు లభించాయి. బీఆర్‌ఎస్ 30ఓట్లతోనే సరిపెట్టుకుంది. బీబీపాటిల్‌పై షెట్కార్ ఈ బూత్‌లో 159ఓట్ల ఆధిక్యతను సాధించారు.

మున్సిపాలిటీలో 940ఓట్లు

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోను కాంగ్రెస్ ఆధిక్యం కనిపించింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాస్త ఆధిక్యత తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 5,590, బీఆర్‌ఎస్ 4,432 ఓట్లు సాధించగా బీజేపీకి 453ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ 1,158ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 5,394ఓట్లు సాధించగా బీజేపీ 4,454 ఓట్లు పొందింది. బీఆర్‌ఎస్ 593ఓట్లకే పరిమితమైంది. బీజేపీపై కాంగ్రెస్ 940ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది.

ప్రథమ స్థానంలో నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో చిట్కుల్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ 114లో తన ఓటుహక్కును వినియోగించుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ పోలింగ్ స్టేషన్‌లో మొత్తం 1078ఓట్లు ఉండగా ఆయనకు 625ఓట్లు పోలయ్యాయి. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 245, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 191ఓట్లు పోలయ్యాయి.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

పంటసాగులో రైతలకు రోజురోజుకు ఖర్చులు పెరుగుతున్నాయి. విత్తనాల నుంచి రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో పెట్టుబడి అధికం కావడం వల్ల రైతుకు నష్టమే మిగులుతోంది. అందుకే రైతు పెట్టుబడి తగ్గించుకొనేలా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి.

– హత్నూర(సంగారెడ్డి)

- రసాయన ఎరువులు తగ్గించాలి
- ఖర్చులు తక్కువ.. దిగుబడి ఎక్కువ..
- వ్యవసాయ విస్తీర్ణాధికారి వరప్రతాప్



పచ్చిరొట్ట పంట

రైతులు తమ సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించుకుంటే ఖర్చు తగ్గుతుంది. అందుకు పచ్చిరొట్ట సాగు ఎంతో ముఖ్యమని హత్నూర మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి వరప్రతాప్ అన్నారు. పాత రోజుల్లో వ్యవసాయం అంటే అర్థం పాడి, పంట. పశువుల పెంపకం, వ్యవసాయం రెండు జంటగా ఉండేవి. పంటకు పశువుల ఎరువు దొరకడంతో రసాయనిక ఎరువుల అవసరం ఉండేది కాదు. ఆ ఎరువు వల్ల నేలలో సేంద్రీయ పదార్థం ఎక్కువగా ఉండడం వల్ల పురుగుమందుల ఖర్చుకూడా ఉండేది కాదు. కానీ ఇటీవల పశువుల ఎరువు కొరత పెరిగిపోవడం వల్ల రసాయనిక ఎరువులు, అటు పురుగు మందుల ఖర్చు కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతు పచ్చిరొట్ట ఎరువు పంటలు సాగుచేయడం ఎంతో ముఖ్యం అని ఆయన వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు చౌకగా దొరుకుతాయి. ఇవి రెండు రకాలు

1. పచ్చిరొట్ట పంటలు:

పచ్చిరొట్ట పంటల్లో ముఖ్యంగా జనుము, జీలుగ, పిల్లి పెసర, పెసర, అలసంద, ఉలవ వంటివి ముఖ్యం. జీలుగ ఎక్కువ నీరు నిలిచే పొలాల్లో, చౌడు భూముల్లో వేసుకోవడానికి అనుకూలం. జనుము అయితే నీరు నిలవని పొలాల్లో, నీటి ఎద్దడి ప్రాంతాల్లో వేసుకోవడానికి అనుకూలం. జనుము, జీలుగ పొలాల్లో వేసుకున్న తర్వాత అవి 50శాతం పూతదశకు వచ్చాక భూముల్లో కలియదున్నాలి. దాని వల్ల నేలలో సేంద్రీయ పదార్థం మెరుగుపడి పంట దిగుబడి అధికమయ్యే అవకాశం ఉంది.

2.ఆకు ఎరువులు:

సుబాబుల్, కానుగ, తంగేడు, జిల్లేడు వంటి చెట్ల నుంచి లేత కొమ్మలు, ఆకులను తీసుకొని పొలంలోవేసి బాగా కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల కూడా భూసారం పెరుగుతోంది.

ప్రయోజనాలు:

- పచ్చిరొట్ట వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవరసాయన చర్యలు జరగడం వల్ల భూసారం పెరిగి, దిగుబడులు పెరుగుతాయి.
- కలుపుమొక్కలు పెరగకుండా ఇవి కాపాడతాయి.
- పశువుల మేతగా కూడా ఉపయోగపడతాయి. ఈ పచ్చిరొట్ట విత్తనాలు ఇప్పుడు రైతులుసాగు చేసుకునేందుకు ప్రస్తుతం అనుకూలంగా ఉంది. ప్రభుత్వం సైతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసింది. ఇంకా అవసరం ఉన్న రైతులకు వ్యవసాయశాఖ పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

యూరియాను తగ్గించుకోవచ్చు..



ఈ విధంగా పొలంలో పచ్చిరొట్టను కలియదున్నడం వల్ల నత్రజనికి చెందిన ఎరువు యూరియాను 25 నుండి 30 శాతం తగ్గించుకోవచ్చు. అంతేకాకుండా భాస్వరం, పొటాష్ ఎరువులను ఎక్కువ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జింక్, ఇనుము, మాంగనీసు వంటి సూక్ష్మ ధాతువుల లోపాలను కూడా తగ్గించుకోవచ్చు. దీనివల్ల పంట దిగుబడి బాగాపెరుగుతుంది.

మోతాదు: ఎకరాకు 12నుంచి 14కిలోల విత్తనం అవసరం. అలాగే దున్నేటప్పుడు ఎకరానికి 100 నుంచి 150కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే రొట్ట బాగా కుళ్లి మంచి ఫలితాన్నిస్తుంది.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి



గేదె కళేబరం

సంగారెడ్డి: పిడుగుపాటుకు ఓ పాడిగేదే మృతి చెందింది. బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో కుమ్మరి ఆంజనేయులకు చెందిన బర్రె మృతి చెందింది. తమకు అదే జీవనాధారం అని ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు. బర్రె పాలు అమ్మగా వచ్చే డబ్బుతోనే జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

రెండెడ్లు అపహరణ

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గ్రామానికి చెందిన గాండ్ల శాంతకుమార్‌కు సంబంధించిన రెండెడ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బుధవారం బుదేరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. నాలుగో తేదీ రాత్రి రోజులాగానే ఇంటి ఎదుట కట్టేసి ఇంట్లో నిద్రపోయానని, ఉదయం లేచి చూడగా ఎడ్లు లేవని వాపోయారు. దీంతో చుట్టు ప్రక్కల వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆస్పత్రిని పట్టించుకోవడం లేదు



మాట్లాడుతున్న పండాల్ జ్యోతి

జహీరాబాద్: ఏరియా ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళామోర్చ నియోజకవర్గం కన్వీనర్ జ్యోతి పండాల్ కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో అనేక సమస్యలు నెలకొన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి చైర్మన్‌గా ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఉన్నా పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు తిష్ఠ వేస్తున్నాయని విమర్శించారు. సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెరుగైన వైద్యసేవలు అందడం లేదని వాపోయారు. సమావేశంలో బీజేవైఎం నాయకులు సతీష్, గౌతం, బస్వరాజ్ పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న మాణిక్

- విద్యార్థి సంఘాలు

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ఇంటర్నేషనల్ విద్యాసంస్థలలో ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులకు కచ్చితంగా 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ పెరిగిందని, ఉన్నతాధికారులు ఆయా పాఠశాలలను పరిశీలించి దోపిడీని అరికట్టాలని కోరారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, శివకుమార్, మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాణిక్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని, బహిరంగ బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఈఓకు వినతి

జహీరాబాద్ టౌన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల దోపిడీని అరికట్టాలని అఖిల భారత విద్యాసమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి డిమాండ్ చేశారు. మండల విద్యాధికారి బస్వరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్య వ్యాపారంగా మారిందని, తల్లిదండ్రుల బలహీనతను నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫాంలు, పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ఫీజుల వసూల్‌ను నియంత్రించాలని కోరారు. అశోక్, ఇసాక్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాల్లేవు



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- ధర్నాలో పారిశుద్ధ్య కార్మికులు

జిన్నారం(పటాన్‌చెరు): నాలుగు నెలలుగా తమకు జీతాలు లేవని, జీతాలు త్వరగా చెల్లించాలని కోరుతూ జిన్నారం పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. బుధవారం గంటపాటు ధర్నా చేపట్టడంతో పంచాయతీ ఈఓ లక్ష్మీకాంత్ వారితో మాట్లాడారు. నిధుల విడుదల కావడంలో సమస్య ఉందని, త్వరలోనే వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, పుట్టి భాస్కర్ తదితరులు కార్మికులతో మాట్లాడి త్వరగా వేతనాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు తాము అండగా ఉంటామని వారు సంఘీభావం తెలిపారు.

వెంకట్రామిరెడ్డి కంటే బీజేపీకే ఎక్కువ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తెల్లాపూర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలోని 374పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ కేంద్రంలో ఆయనకు 264ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 481 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 247 ఓట్లు పోలయ్యాయి. ఆయన నివాసం ప్రాంతంలోనే బీజేపీకి ఎక్కువ ఓట్లు పోలవ్వడంతో చర్చనీయాంశంగా మారింది.

దర్గాలో కాంగ్రెస్ నేతల ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపొందడంపై ఆ పార్టీ మండల నాయకులు బుధవారం వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి ప్రజలు 3,158 ఓట్ల మెజార్టీ ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీలపై విశ్వాసంగా ఉన్నారనడానికి నిదర్శనమని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు రాంరెడ్డి, జానయ్య, మాజీ సర్పంచ్‌లు నారాయణగౌడ్, సంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ విఠల్, నాయకులు గోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రావు పాటిల్, పెద్దన్న, కమార్‌రావు, మల్లికార్జున్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాలి అనిల్ కుమార్‌కు 158 ఓట్లు

జహీరాబాద్: పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్‌కు సొంత గ్రామంలో 158ఓట్లు మాత్రమే పోలయ్యాయి. మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామంలో ఎన్నికలకు ముందు ఆయన ఓటుహక్కును నమోదు చేయించుకున్నారు. గ్రామంలో మొత్తం 1416ఓట్లు పోలవ్వగా 158ఓట్లు, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 470ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు 747ఓట్లు పోలయ్యాయి.

వోక్స్ వ్యాగన్ యూనివర్సిటీ ఎదుట ధర్నా



నిరసన తెలుపుతున్న బాధితులు, గ్రామస్తులు

మునిపల్లి(అందోల్): కంకోల్ గ్రామానికి చెందిన దోషాడ సంగమేశ్వర్ నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు వోక్స్ వ్యాగన్ యూనివర్సిటీ ఎదుట ధర్నా చేశారు. సంగమేశ్వర్ యూనివర్సిటీలో గార్డుగా పనిచేసేవాడు. కాని ఆచూకీ తెలియక పోవడంతో అతడి భార్య జ్యోతి బుధవారం 65వ నంబర్ జాతీయ రహదారిపై బైటాయించి న్యాయం కావాలంటూ నినాదాలు చేసింది. తన భర్త వివరాలు తెలియజేయాలని కన్నీరుమున్నీరైంది. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తులు రోడ్డుపై బైటాయించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని నిరసన విరమించాలని చెప్పారు. చెప్పినా ససేమిరా అనడంతో ఆందోళనకారులను చెదరగొట్టారు. రోడ్డుపై అడ్డంగా ఉంచిన ట్రాక్టర్ టైర్లను పోలీసులు తొలగించారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు రామిరెడ్డి, సతీశ్ కుమార్ సంగమేశ్వర్ అదృశ్యంపై వాకబు చేశారు.

రఘున్న వెంటే పటాన్‌చెరు ఓటర్లు

- టీచర్, జర్నలిస్టు, అడ్వకేట్‌గా పటాన్‌చెరు ప్రజలకు సుపరిచితుడు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మంచి మెజార్టీ వచ్చింది. ఆయన ఈ ప్రాంతంలో రెండు దశాబ్దాలకుపైగా సొంతింట్లో నివసించారు. దుబ్బాక ప్రాంతం నుంచి వలస వచ్చి స్థిరపడినా ఆయనను ప్రజలు పట్టణ వాస్తవ్యుడిగానే భావిస్తారు. రఘున్నా అంటూ ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఈ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చారు. అంతకు ముందు విలేకరిగా పనిచేశారు. అప్పుడే అన్ని వర్గాలకు దగ్గరయ్యారు. తెలంగాణ ఉద్యమ కాలంలో టీఆర్‌ఎస్ యువత జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. జెడ్పీటీసీగా పోటీచేసి ఓడిపోయారు. శాంతినగర్‌లో ఉంటూ అడ్వకేట్‌గా కూడా ప్రజలకు సేవలు అందించారు. ఆ తర్వాత ఆయన దుబ్బాకలో ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. మెదక్ ఎంపీగా పోటీచేసిన ఆయనకు ఈ ప్రాంత వాసులు మంచి మెజారిటీ ఇచ్చారు. బీజేపీ నుంచి పోటీచేసిన ఆయనకు 1,03,775 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థిపై 9,481 మెజారిటీ సాధించారు. బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పడిపోయింది.

ఉమ్మడి ఖేడ్‌లో కాంగ్రెస్ ఆధిక్యత

నారాయణఖేడ్: ఉమ్మడి నారాయణఖేడ్ మండలంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ 6,421ఓట్ల ఆధిక్యత లభించింది. మండలంలో మొత్తం 67,699మంది ఓటర్లు ఉండగా 47,593ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌కు 7,930ఓట్లు, బీజేపీకి 15,695ఓట్లు, కాంగ్రెస్‌కు 22,116ఓట్లు లభించాయి. దీంతో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ 6,421ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బీజేపీకి కొత్తపల్లిలో ఒక్క ఓటు ఆధిక్యత, నిజాంపేటలోని 113వ బూత్‌లో రెండు, మాద్వార్‌ండా, తెట్టెకుంట తండాల్లో ఐదు ఓట్ల చొప్పున ఆధిక్యత లభించింది. మొత్తానికి ఉమ్మడి మండలంలో 84 గ్రామాలు, తండాలు ఉండగా 33గ్రామాలు, తండాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించగా మిగిలిన 51 గ్రామాలు, తండాల్లో బీజేపీకి స్వల్ప ఓట్ల ఆధిక్యత వచ్చింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెల్లాపూర్ పరిధిలో ఆమె మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఒక మొక్కనైనా నాటాలని సూచించారు. భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు శ్రీశైలం, పావని తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం భెల్ టౌన్‌షిప్‌లో గ్రీన్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీను బెల్ ఈడీ కేబీ రాజా జెండాను ఊపి ప్రారంభించారు.

మొక్కలు నాటుదాం: ఎంపీడీఓ

పటాన్‌చెరు టౌన్: మొక్కలు నాటుదాం.. పర్యావరణను కాపాడుదాం అని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మండలంలోని రామేశ్వరం బండ, లక్డారం గ్రామాలలో పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఎంపీఓ హరిశంకర్ గౌడ్ ఆయా గ్రామాల కార్యదర్శిలు పాల్గొన్నారు.

భూతాపం వల్ల నష్టం

కంది(సంగారెడ్డి): అడవులు, చెట్లను నరకడం వల్ల భూతాపం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని ఎంపీఓ మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాణవాయువును ఇచ్చే మొక్కలను అందరూ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉద్యోగులు

జిన్నారం(పటాన్‌చెరు): పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో గల టీఐడీసీ పరిశ్రమలో కార్మికులు, ఉద్యోగులు మొక్కలు నాటారు. కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలోమొక్కలు నాటాలని కార్మిక సంఘం నాయకులు సూచించారు.

మొక్కల పంపిణీ..

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె) గ్రామంలో గ్రామస్తులకు యునైటెడ్‌వే ముంబాయి, ప్రిన్స్పెప్స్ ఆధ్వర్యంలో ఖేడ్ జలసంజీవని సభ్యులు మొక్కలను పంపిణీ చేశారు. టీం లీడర్ శివరాజ్ నాయక్, సభ్యులు ముజమ్మిల్, సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. అలాగే జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ న్యాయవాదులు భోజిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, సంగమేశ్వర్‌రెడ్డి, సాయిలు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



నారాయణఖేడ్: మొక్క నాటుతున్న న్యాయమూర్తి శ్రీధర్